క్లుప్తంగా

నేడు బస్తీ దవాఖానా ప్రారంభం

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్‌కాలనీలో బస్తీ దవాఖానా ఎట్టకేలకు గురువారం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి హాజరుకానున్నట్లు డాక్టర్ నాగేష్ బుధవారం తెలిపారు. రెండేళ్ల క్రితం రూ.13లక్షలు ఖర్చు చేసి దవాఖానాకు మరమ్మతులు చేశారు. ఎమ్మెల్యే చొరవతో ఆసుపత్రి అందుబాటులోకి వస్తుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న నల్లగొండ అరోరా లా కళాశాల విద్యార్థులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అరోరా లా కళాశాల విద్యార్థినులు బండి అశ్వినీ, దుర్గాభవానీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నల్లగొండ అరోరా లా కళాశాల విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవడం కోసం ప్రభుత్వం పోక్సో చట్టాలను రూపొందించిందన్నారు. పోక్సో చట్టం 18సంవత్సరాల పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కొనమంచిలి శ్రీనివాస్, తాజా మాజీ సర్పంచ్ శాగం శ్రవన్‌కుమార్‌రెడ్డి, అన్వేష్, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

త్రిపురారం/మిర్యాలగూడ టౌన్ : 108 వాహనంలో ప్రసవం కావడంతో తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వాహన ఈఎంటీ బ్రహ్మ బుధవారం తెలిపారు. త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉన్న 108 వాహనానికి తెలవారుజామున మిర్యాలగూడ మండలంలోని వెంటాద్రిపాలెం గ్రామాని చెందిన అలివేలుకు పురిటినొప్పులు వస్తున్నాయని ఫోన్ చేశారన్నారు. దీంతో 108 వాహనం అక్కడకు చేరుకొని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించే లోపు నొప్పులు ఎక్కువ కావడంతో ప్రసవం చేశామన్నారు. అలివేలు మగ బిడ్డకు జన్మనిచ్చిందని, తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని అన్నారు.

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

దేవరకొండ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దేప సుదర్శన్‌రెడ్డి, పోలె వెంకటయ్య, నూనె రామస్వామి, వలమల్ల ఆంజనేయులు, జూలూరి వెంకట్రాములు, మైనొద్దీన్, నూనె వెంకటేశ్వర్లు, యాదయ్య, తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయకుమారి

త్రిపురారం : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి హెచ్ఎంలు కృషి చేయాలని ఎంపీడీఓ విజయకుమారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బడిబాట కార్యక్రమంలో గ్రామాల్లో 05 నుంచి 14ఏళ్ల పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించి, డ్రాపవుట్లు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో త్రిపురారం ఎంఈఓ రమావత్ రవి, సైదిరెడ్డి, గంగాధర్‌రావు, వెంకట్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

మాడ్గులపల్లి : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి షేక్ బాబా అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10, 11, 12తేదీల్లో నిర్వహించే గావ్ చలో అభియాన్– బస్తీ చలో అభియాన్ కార్యక్రమంతో పాటు మాజీ ప్రధాని అటల్‌బిహార్ వాజ్‌పేయ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో గడ్డం వెంకట్‌రెడ్డి, బొమ్మకంటి నరసింహ, కడియం సైదులు, బోలగాని ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మణ్, నాగరాజు, యాదగిరి, చిలుముల శ్రీనివాస్‌రెడ్డి, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిలువ నీడ కరువు



బస్సు కోసం ఎండలో ఎదురుచూస్తున్న ప్రయాణికులు



గుర్రంపోడులో రోడ్డుపైనే నిలిపిన బస్సు

- మండుటెండలో రోడ్డుపైనే ప్రయాణికుల ఎదురుచూపు
- చెట్లనీడన, దుకాణాల ఎదుట బస్సుల కోసం నిరీక్షణ
- బస్టాండ్ ఏర్పాటు చేయాలని వేడుకోలు

గుర్రంపోడు : ఆర్టీసీ ప్రయాణికులకు నిలువ నీడ కరువవుతోంది. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ రోడ్లపైనే వారు బస్సుల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. మండలంలో బస్టాండ్‌లో లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న ఆర్టీసీ అధికారులు సౌకర్యాల కల్పనపై మాత్రం దృష్టి సారించకపోవడం మరిచారు. ప్రస్తుతం వేసవి ప్రారంభమైనందున ఎండలు అధికమవుతుండడంతో మండల కేంద్రంలో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఈ నేపథ్యంల ఆర్టీసీ డ్రైవర్లు బస్సులు నిలిపేందుకు నిర్ణీత స్థలం లేక తమ ఇష్టం వచ్చిన చోట్ల నిలుపుతుండడంతో ప్రయాణికులు ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వస్తుంది. ముఖ్యంగా వృద్ధులు, స్త్రీలు, చిన్న పిల్లలు బస్సు కోసం వేచి చూసే క్రమంలో నిలబడ లేక ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం కూడలిలో ఉన్న ఒక్క చెట్టు కిందనే రోడ్డు పక్కన, దుకాణాల ఎదుట ప్రయాణికులు నిలబడాల్సి వస్తుంది.

స్థలం కొరతతో నిలిచిన నిర్మాణం..

గతంలో అన్ని మండల కేంద్రాల్లో బస్‌స్టేషన్ల నిర్మాణాలు జరిగాయి. ఇక్కడ స్థలం కొరత కారణంగా బస్‌స్టేషన్ నిర్మాణానికి నోచుకోలేదు. కొన్నేళ్ల క్రితం ఆర్టీసీ వారు తాత్కాలికంగా తడకలతో వేసవిలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేసి ప్రయాణికుల ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకునేవారు. ఆ తర్వాత ఆర్టీసీ వారు కూడా పట్టించుకోలేదు. బస్టాండ్ నిర్మాణం ఉంటే తాగునీరు, మరుగుదొడ్లు లాంటి సౌకర్యాలు ఉండేవి.

ట్రాఫిక్‌కు అంతరాయం..

మండల కేంద్రం కూడలిలో నల్లగొండ– దేవరకొండ ప్రధాన రహదారిపై రోడ్డు పక్కనే ఆర్టీసీ బస్సులు ఆపుతుండడం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. బారికేట్లు ఏర్పాటు చేసి బస్సులు నిలిపేందుకు స్థలం ఏర్పాటు చేస్తున్నా పోలీసు సిబ్బంది కొరతతో ఎప్పుడూ అమలు కావడం లేదు. ప్రధాన రహదారిపై రద్దీకి తోడు బస్సులు నిలుస్తుండడం, వచ్చిపోయే ప్రయాణికులతో మరింత రద్దీతో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్టాండ్ ఏర్పాటు ప్రయాణికుల సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బస్టాండ్ ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌తో పా టు సులభ్‌కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలి. ఎన్నికలకు ముందు మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నా అవి అమలు కావడంలో మరింత జాప్యం జరుగుతుంది. వెంటనే బస్టాండ్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలి.

– వనమాల కామేశ్వర్, గుర్రంపోడు

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బాలునాయక్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

దేవరకొండ : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో నిర్వహించిన సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నాయిని మాధవరెడ్డి, సిరాజ్‌ఖాన్, ఆలంపల్లి నర్సింహ, ముక్కమళ్ల వెంకటయ్య, శిరందాసు కృష్ణయ్య, వేణుధర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, నల్లగాసు జాన్‌యాదవ్, లచ్చిరాం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెద్దవూర : మండల కేంద్రంలోని సిద్దార్థ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 2011–12 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా 15ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. నాడు బడిలో చేసిన అల్లరి, గడిపిన మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో నాటి హెచ్ఎం సలికంటి వెంకటయ్య, ఉపాధ్యాయులు పాకాల నర్సింహ, గంధం వినోద్‌కుమార్, ఖలీల్, ఏడుకొండలచారి, శంకరాచారి, నరేందర్, దామోదర్, నాటి విద్యార్థులు శోభ, సింధు, నాగరాజు, నాగమణి, మంగమ్మ, శ్రీలేఖ, ప్రమీల, హైమద్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్రభుత్వ వైద్య సేవలు మెరుగ్గా అందించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలపై వైద్యులతో చర్చిస్తున్న కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

నిడమనూరు : ప్రభుత్వ వైద్య సేవలు మరింతా మెరుగ్గా అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యులను ఆదేశించారు. శిథిల భవనం.. అందని వైద్యం శీర్షికతో బుధవారం నాడు సాక్షి పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన కలెక్టర్ పర్యటనలో భాగంగా నిడమనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి వైద్యాధికారులతో చర్చించారు. నూతన భవనం త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నెలలో భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రి సిబ్బంది, వైద్యులు సక్రమంగా విధులకు హాజరుకావాలన్నారు. కాగా కలెక్టర్ ఆస్పత్రి వచ్చిన సమయంలో వైద్యులు అందుబాటులో లేరు. వచ్చిన విషయం తెలుసుకుని హడావుడిగా తమ వాహనాల్లో ఆస్పత్రికి చేరుకుని లంచ్‌కు వెళ్లివచ్చినట్లు వారు వివరించారు. అనంతరం నిడమనూరు తహసీల్దార్ కార్యాలయానికి ఆమె వెళ్లి సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల వివరాలు, ధరణి సేవలు సక్రమంగా అమలు చేయాలని తదితర విషయాలపై తహసీల్దార్ కృష్ణయ్యకు సూచించారు. ఆమె వెంట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు అరవింద్, రఫీ, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, వైద్యసిబ్బంది ఉన్నారు.

బీఆర్‌ఎస్ సభను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని రెడ్డికాలనీలో గల పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డితో కలిసి నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభకు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో దుర్గంపూడి నారాయణరెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మట్టపల్లి సైదయ్యయాదవ్, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పాలుట్ల బాబయ్య, ఇలియాస్, జొన్నలగడ్డ రంగారెడ్డి, యూసుఫ్, కుందూరు వీరకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌దే

- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. హన్మకొండలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో బీఆర్‌ఎస్ ముఖ్యనేతలతో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసుగు చెందారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనపై రాష్ట్ర ప్రజలు విముకతతో ఉన్నారని, మూడేళ్ల తరువాత రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీదే అధికారమన్నారు. అధికార పార్టీ నాయకుల మెప్పు కోసం బీఆర్‌ఎస్ నాయకులను, కార్యకర్తలను వేధిస్తే ఏ అధికారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. అనంతరం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, తాటి సత్యపాల్, నాగులవంచ తిరుపతిరావు, పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీష్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు యడవెల్లి మహేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, బొల్లం రవి, వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఏచూరి శ్రీనివాస్, సహాయ అధికారులు ఎం.పవన్‌కుమార్, మంద సైదులు బుధవారం తెలిపారు. మొత్తం 143మంది ఓటర్లు ఉండగా అధ్యక్ష పదవికి మైనం మహేష్, నేతి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పదవికి అలుగుబెల్లి భూపతిరెడ్డి, పొన్నూరు విజయసారధి, మహిళా కార్యదర్శి పదవికి అనంతుల దుర్గాభవాని, శ్రీదేవి పోటీపడుతున్నారు. ఉదయం 9గంటల నుంచి 2గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అనంతరం 3గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

హాలియా : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరిత అన్నారు. ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని మారేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శ్రీవేణి, ఏఎన్ఎం, ఆశాలు, తల్లులు, పిల్లలు ఉన్నారు.

శిశువుకు ముర్రుపాలు తాపించాలి

మిర్యాలగూడ టౌన్ : పుట్టిన గంటలోపే శిశువుకు తల్లి ముర్రుపాలు తాపిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. బుధవారం పట్టణంలోని ఈదులగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విజయ, అంగన్‌వాడీ టీచర్లు బొందు పార్వతి, సీహెచ్ రామానుంజమ్మ, జి.రజిత, ఎం.లలితమ్మ, ఆశావర్కర్లు నవ్య, స్రవంతి ఉన్నారు.

అధికారులు సహకరించాలి

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 22వరకు నిర్వహించే పోషణ పక్షం కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ రేఖల మమత కోరారు. బుధవారం మిర్యాలగూడ ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీఓ శేషగిరి శర్మ, మండల విద్యాశాధికారి బాలునాయక్, డాక్టర్ మోయిద్, ఏపీఎం కృష్ణమూర్తి, ఝాన్సీ, సూపర్‌వైజర్లు రాధిక, హేమాదేవి, వాణి తదితరులున్నారు.

త్రిపురారం : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ నేతి శైలజ అన్నారు. బుధవారం ఐసీడీఎస్ దామరచర్ల ప్రాజెక్ట్ పరిధిలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నూర్జహాన్, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

నిడమనూరు : పౌష్టికాహారం తీసుకోవడంతోనే గర్భిణులు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫరిదాబేగం అన్నారు. బుధవారం మండలంలోని ముకుందాపురం, వడ్డెరిగూడెం గ్రామాల్లో పోషణ్ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రసన్న, మణెమ్మ, ప్రేమలత, జ్యోతి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



పెద్దవూర : కొత్తలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

- ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



నిడమనూరు : తుమ్మడంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

పెద్దవూర : గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పైలట్ గ్రామంగా ఎంపికైన కొత్తలూరులో 34 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి మాట్లాడారు. గతంలోనూ కాంగ్రెస్ హయాంలోనే అన్ని గ్రామాలలో వేలాదిగా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం ఆ ఇళ్లలోనే ప్రజలు నివాసం ఉంటున్నట్లు, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పైలట్ గ్రామంగా ఎంపిక చేసిన కొత్తలూరును ఆదర్శ గ్రామంగా తీర్చుదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, మండల ప్రత్యేక అధికారి, హౌజింగ్ పీడీ ఎస్పీ రాజ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సుధీర్‌కుమార్, నాయకులు వద్దిరెడ్డి రవీందర్‌రెడ్డి, కిలారి మురళీ, నాగరాజు, అరుణ్‌రెడ్డి, కర్ణ దామోదర్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

త్రిపురారం : ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగుతుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన కంపాలపల్లి గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ముడిమళ్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, గోపగాని మాధవి, ధనావత్ భాస్కర్‌నాయక్, ఎంపీడీఓ విజయకుమారి, అంబటి సోమయ్య, చిట్టు రవి, మర్ల చంద్రారెడ్డి, అమరేందర్‌రెడ్డి, ఆలంపల్లి జానయ్య, సలికంటి బాలకృష్ణ, అశోక్, మహిళ అధ్యక్షురాలు పద్మ, జయకృష్ణ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సమర్థంగా అమలుచేస్తా

నిడమనూరు : సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తామని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా బుధవారం తుమ్మడం గ్రామంలో ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ పీడీ రాజ్‌కుమార్, డీఈ వెంకటేశ్వర్లు, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, నాయకులు ఎడవెల్లి వల్లాభరెడ్డి, నూకల వెంకట్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, సైదిరెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, ముంగి శివమారయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బోనగిరి రమేష్, కార్యదర్శి లింగయ్య పాల్గొన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గుర్రంపోడు : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తాము పండించిన ధాన్యాన్ని అమ్ముకుని మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొప్పోలు గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం జూనూతుల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, కంచర్ల విజేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చనమల్ల యాదవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

మిర్యాలగూడ : ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి తెలిపారు. బుధవారం దామరచర్ల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా అధికారులు మోటార్లను, చేతిపంపులను, పైపులైన్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో మురుగునీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు

మిర్యాలగూడ టౌన్ : చెల్లని చెక్కు కేసులో ఓ వ్యక్తికి 15నెలల జైలు శిక్షను విధిస్తూ బుధవారం మిర్యాలగూడ మొదటి అదనపు జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బీఎస్ఎన్ సుమబాల తీర్పునిచ్చారు. వివరాల ప్రకారం.. అనుముల మండలానికి చెందిన బండి లక్ష్మీనారాయణ 2014లో హాలియాకు చెందిన శాగం మణెమ్మ వద్ద రూ.23లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు నిమిత్తం లక్ష్మీనారాయణ 2016లో రూ.33లక్షల చెక్కును బాధితురాలికి ఇచ్చాడు. ఆమె చెక్కును బ్యాంకులో జమచేయగా సదరు అకౌంట్‌లో డబ్బులు లేవని బ్యాంకు వారు చెక్కును వాపస్ పంపారు. తాను మోసపోయానని భావించిన బాధితురాలు కోర్టును ఆశ్రయించింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో 15నెలల జైలుతో పాటు రూ.33లక్షల నష్టపరిహారం బాధితురాలికి అందించాలని తీర్పునిచ్చారు.

ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి

మాడ్గులపల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఓ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆగామోత్కూర్, పాములపాడు, చిరుమర్తి, గుర్రప్పగూడెం గ్రామాల్లో డీఆర్‌డీఏ సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు తమ ధాన్యంలో 17శాతం తేమ ఉండేలా చూసుకొని కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొస్తే గరిష్ట మద్దతు ధర రూ.2320, సాధారణ రకానికి రూ.2300 చెల్లించడంతో పాటు సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం బాషపాక చంద్రశేఖర్, సీసీ నాగయ్య, వీఓ అధ్యక్షురాలు రేణుక, తర్కదా సంఘం అధ్యక్షురాలు సంధ్య, ఉషయ్య, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



మాడ్గులపల్లి : ఆగామోత్కూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీఓ పీడీ శేఖర్‌రెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

అడవిదేవులపల్లి : మండలంలోని ఉల్సాయిపాలెం గ్రామంలో బుధవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాన్ని ఎంపీడీఓ రమేష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం శేషయ్య, ఎపీఓ సుర్యానారాయణ, సీఆర్‌పీ నిర్మల, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలునాయక్, సంఘం అధ్యక్షురాలు రమావత్ జ్యోతి, వినోద, రమావత్ శ్రీను తదితరులున్నారు.

బహుజనులపై జరుగుతున్న దాడులపై ఆందోళన

మిర్యాలగూడ టౌన్ : బహుజనులు, మహిళలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో బుధవారం భారత్ ముక్తి మోర్చా, నేషనల్ ఓబీసీ మోర్చా, జాతీయ గోర్ బంజార క్రాంతి సంఘ్, బహుజన క్రాంతి మోర్చా, రాష్ట్రీయ ముస్లిం మోర్చాల పిలుపు మేరకు ఆయా పార్టీల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం బహుజన ముక్తి మోర్చా జిల్లా నేత గణేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వజ్జగిరి అంజయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనయ్య, కృష్ణ, వెంకటనర్సమ్మ, శ్రీనివాస్, సయ్యద్ మోసిన్, కిరణ్, షమీ, రామకృష్ణ, వెంకన్న, లక్ష్మణ్, నాయకులు తదితరులున్నారు.

పెంచిన వంట గ్యాస్ ధరను తగ్గించాలని ధర్నా



దేవరకొండ : ఖాళీ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు



మిర్యాలగూడ అర్బన్ : ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో..

దేవరకొండ : కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో ఖాళీ సిలిండర్లతో ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడారు. గ్యాస్ సిలిండర్లపై రూ.50 అదనంగా పెంచడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలపై మరింత ఆర్థికభారం పడుతుందన్నారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, నూనె రామస్వామి, ఆంజనేయులు తదితరులున్నారు.

గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలి

మిర్యాలగూడ అర్బన్ : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ సీపీఎం, ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో బుధవారం వేర్వేరుగా నిరసన చేపట్టారు. మండలంలోని జప్తివీరప్పగూడం, ఉట్లపల్లి, యాద్గార్‌పల్లి, బాదలాపురం గ్రామాలలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో భాగంగా కట్టెల పొయ్యిపై వంటలు చేస్తూ నిరసన చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య, సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్, నాయకులు రామకృష్ణ, నాగరాజు, ఆంజనేయులు, వెంకన్న, నరేష్, చిరంజీవి, ఎంసీపీఐయూ నాయకులు వస్కుల సైదమ్మ, కాశి, జ్యోతి కిరణ్, వీరన్న, మౌనిక, ఆశీర్వాదం, ముత్తయ్య, ప్రశాంత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.